క్లుప్తంగా

మానసిక ఆరోగ్యం కీలకం



మాట్లాడుతున్న సత్యనారాయణ

గజ్వేల్: ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడానికి మానసిక ఆరోగ్యం ఎంతో కీలకమని లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండలంలోని బూర్గుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెంటల్ వెల్‌నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని కష్టాలు వచ్చినా, మనోనిబ్బరం కోల్పోవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్, అబ్దుల్‌రఫిక్, కవిత తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆదాయం రూ.4.36 లక్షలు



ఆదాయం లెక్కించిన అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండ పోచమ్మ హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. తొంభై రోజులకు సంబంధించి రూ. 4.36 లక్షల ఆదాయం వచ్చిందని దేవాదాయశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఆలయ చైర్‌పర్సన్ అనుగీత చెప్పారు. కార్యక్రమంలో ఈఓ రవికుమార్, డైరెక్టర్లు జనార్దన్‌రెడ్డి, రాజు, నర్సింహులు, కిషన్, నరేశ్, ఆగమల్లు, అర్చకుడు రమేశ్, కొండయ్య, యాదగిరి, సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, సుధాకర్, చందు, హరి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

బంద్ పాక్షికం



మూతపడిన దుకాణాలు

హుస్నాబాద్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన బంద్ పాక్షికంగా జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే జంతర్ మంతర్ వద్ద బీసీల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీల మీద ఏ పార్టీకి ప్రేమ లేదన్నారు. అన్ని పార్టీల నాయకులు బీసీలను ఇక ముందు ఓట్లు వేయాలని కోరే నైతిక హక్కును కోల్పోయారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు, రవీందర్, శ్రీను గౌడ్, మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, ఎమ్మెల్యేల పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న వెంకటయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం మండల పరిధిలోని గంగాపూర్‌లోని ఆయన స్వగృహంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శించారు. వారిలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, గొంగిడి సునీత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ శర్మ, సతీష్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

తహసీల్దార్లకు సన్మానం



తహసీల్దార్లను సన్మానించిన శ్రీకాంత్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సమీర్ అహ్మద్‌ఖాన్‌ను బీజేపీ సీనియర్ నాయకుడు, గుడికందుల మాజీ ఉప సర్పంచ్ మల్లుగారి శ్రీకాంత్‌రెడ్డి సన్మానించారు. కార్యాలయంలో శుక్రవారం నూతన తహసీల్దార్‌తో పాటు ఇక్కడ బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ శ్రీకాంత్‌ను కూడా ఆయన సన్మానించారు. అలాగే కార్యాలయ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు చంద్రశేఖర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఓసీ.. అసంపూర్తిగా వదిలేసి

ప్రభుత్వాలు మారినా పట్టణంలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయం స్థితి మాత్రం మారడంలేదు. ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉండటంతో ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

ఏడేళ్లుగా పూర్తికాని నిర్మాణం
- కింది అంతస్తులోనే ఆరు కార్యాలయాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



అసంపూర్తిగా ఐఓసీ మొదటి అంతస్తు



దుబ్బాకటౌన్: దుబ్బాకలో ఉన్న దాదాపు 18 ప్రభుత్వ శాఖల కార్యాలయాలన్నీ ఒకేచోట ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సేవలు త్వరితగతిన అందించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించింది. అందుకు అనుగుణంగా సమీకృత కార్యాలయాల భవన సముదాయం(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్- ఐఓసీ) నిర్మాణాన్ని చేపట్టింది. కింది అంతస్తులో కార్యాలయాలను పూర్తిచేసిన అధికారులు మొదటి అంతస్తును స్లాబ్ వరకే నిర్మించి, నిధుల్లేక వదిలేశారు.

మొదటి అంతస్తుకే రూ.17 కోట్లు

పట్టణ శివారులోని రామసముద్రం చెరువుకట్ట దిగువ రహదారికి కిలోమీటర్ దూరంలో నాలుగెకరాల విస్తీర్ణంలో రూ.17 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో జీప్లస్ వన్ తరహాలో ఐఓసీ నిర్మాణ పనులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు 2018లో శంకుస్థాపన చేశారు.

పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో

చెరువుకట్ట సమీపంలో నిర్మాణం చేపట్టగా అక్కడ నేల పటిష్టంగా లేదు. దీంతో పునాది తరచూ కుంగడంతో పునాది నిర్మాణానికే దాదాపు రూ.6 కోట్లకుపైగా నిధులను వెచ్చించారు. దీంతో ఎక్కువ మొత్తం పునాది నిర్మాణానికే వెచ్చించాల్సి వచ్చింది.

ఎన్నికల్లో హడావుడిగా..

రూ.11 కోట్ల నిధులతో కేవలం గ్రౌండ్ ఫ్లోర్లోనే సమావేశ మందిరం, వీడియో కాన్ఫరెన్స్ గది, మండల ప్రణాళిక, గణాంక అధికారి, భూ సర్వేయర్ కార్యాలయం, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్, పంచాయతీరాజ్, అటవీశాఖ, ఉద్యానవన, పట్టుపరిశ్రమశాఖ లాంటి ఆరు శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. 2023 శాసనసభ ఎన్నికలు రావడంతో హడావుడిగా కింది అంతస్తు భవనాన్ని ప్రారంభించారు.

పట్టించుకునే నాథుడే లేడు

పై అంతస్తులో పిల్లర్లు వేసి, స్లాబ్ నిర్మించి, నిధుల్లేక ఏడేళ్లుగా అలాగే వదిలేశారు. కనీసం నిర్మాణం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.17 కోట్లు కింది అంతస్తు నిర్మాణానికే ఖర్చు కావడంతో.. మొదటి అంతస్తు పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. మిగిలిన పనుల కోసం సుమారు రూ.2 కోట్లు అవసరమని అధికారుల అంచనా. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, భవన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ప్రభుత్వం కేటాయించిన రూ.17 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు స్లాబ్ పూర్తిచేశాం. నిధుల కొరతతో మిగిలిన పనులు ఆగిపోయాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– రిజ్వాన్, పీఆర్ ఏఈ, దుబ్బాక

పొగాకు ఆరోగ్యానికి హానికరం

వైద్యాధికారి డాక్టర్ హరిత



మాట్లాడుతున్న వైద్యాధికారి హరిత

కొమురవెల్లి(సిద్దిపేట): పొగతాగడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం చాలా హానికరమని మండల వైద్యాధికారి డాక్టర్ హరిత అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పొగాకు వినియోగం అలాగే డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ పొగతాగడం, పొగాకు ఉత్పత్తులైన గుట్కా, ఖైనీ, తంబాకు, జర్దా లాంటి ఉత్పత్తులు వినియోగించడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతాయన్నారు. బ్రాంకైటిస్, న్యుమోనియా, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండెపోటు, పక్షవాతం, అంధత్వం, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి అనేక అనారోగ్య సమస్యలు కలుగుతాయని చెప్పారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రమేశ్, హెచ్‌ఎం తిరుపతిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ శ్రవణ్‌కుమార్ వర్మ పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి నర్సింహులు

తొగుట(దుబ్బాక): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నర్సింహులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీసీ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల రిజర్వేషన్లు అడ్డుకోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో 65 శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్లు పెంచితే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న అగ్రవర్ణ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వొద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదగిరి, మాజీ సర్పంచ్‌లు గోవర్ధన్, చంద్రం, నాయకులు వెంకటేశం, అశోక్, ఐలయ్య, చంద్రశేఖర్‌గౌడ్, బాలమల్లు, ఆంజనేయులు, ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



నంగునూరు(సిద్దిపేట): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ మాధవి



దుబ్బాకటౌన్: రాయపోల్‌లో..

దళారులను నమ్మి మోసపోవద్దు

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులను నమ్మి తక్కువ ధరకు విక్రయించి మోస పోవద్దని అధికారులు సూచించారు. జిల్లా లోని పలు మండలాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఎంలు, ఏఈఓలు పాల్గొన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.



మర్కూక్(గజ్వేల్): ఎర్రవల్లిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ విజయమోహన్



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌లో..



సిద్దిపేటఅర్బన్: మందపల్లిలో..

సైబర్ మోసాలపై అప్రమత్తం

టూటౌన్ సీఐ ఉపేందర్



మాట్లాడుతున్న టూటౌన్ సీఐ ఉపేందర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కాకతీయ పాఠశాలలో విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సోషల్ మిడియా ప్రభావం, షీటీం, ఈవ్ టీజింగ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులు ఓపెన్ చేయవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ సెల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరైనా వేధించినా, అవహేళనగా మాట్లాడినా వెంబడించిన వెంటనే డయల్ 100, సిద్దిపేట షీ టీమ్ నంబర్ 8712667434కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు కవిత, శ్రీలత, సారిక, సుజాత, రుచిత, సమ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

చేర్యాల(సిద్దిపేట): మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్‌ఐ నవీన్ అన్నారు. మండల పరిధిలోని కడవేర్గు పాఠశాల ఆవరణలో షీటీం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, నూతన చట్టాల గురించి వివరించారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఏదైనా సమస్య క్లాస్ టీచర్ లేదా హెచ్‌ఎంకు తెలియపరచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజమణి, ఉపాధ్యాయులు, షీ టీం బృందం సదయ్య, ప్రశాంతి, స్వప్న, బాబు, కృష్ణ, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాల బారిన పడొద్దు

వర్గల్(గజ్వేల్): విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, చెడు వ్యసనాల బారినపడొద్దని బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కోరారు. షీ టీమ్ ఆధ్వర్యంలో వర్గల్ మండలం నెంటూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ర్యాగింగ్, సైబర్ నేరాలు, వివిధ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. బాలికలు, మహిళలను ఎవరైనా వేధించినా, అవమానించినా డయల్ 100 లేదా 8712667434కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీరాములు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, హెడ్ కానిస్టేబుల్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు నైపుణ్య శిక్షణకు కృషి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



బ్యూటీ వెల్నెస్ సెంటర్ ప్రారంభిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మండల పరిధిలోని చింతమడక ఉన్నత పాఠశాలలో శుక్రవారం బ్యూటీ వెల్నెస్, అప్పారెల్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్య అందించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందించే దిశగా ముందడుగు వేస్తున్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధికి సిద్ధం కావాలని కోరారు. ఎంఈఓ రాజిరెడ్డి, ఉపాధ్యాయులు ఎండీ అజీజ్, సత్తయ్య, రాందాస్, శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటస్వామి, మనీష, శ్రీశైలం, గౌతమి, స్వాతి, రేణుక, పోచయ్య, హరికృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేనుబంక పురుగుతో తీవ్ర నష్టం

ఏఈఓ నాగార్జున



కంది పంటను పరిశీలిస్తున్న నాగార్జున

తొగుట(దుబ్బాక): కంది సాగులో పేనుబంక పురుగును గుర్తించామని, దాని వల్ల పంటకు తీవ్ర నష్టం చేకూరుతుందని ఏఈఓ నాగార్జున అన్నారు. పెద్ద మాసాన్‌పల్లిలో కంది పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంది పూత, లేతకాయ దశలో సాధారణంగా ఆశించే పురుగులో పేనుబంక ముఖ్యమైందన్నారు. పేనుబంక గుంపులుగా చేరి కొమ్మలు ఆకులు, పువ్వుల నుంచి రసాన్ని పీల్చుతాయని, పువ్వులు, కాయలపై ఆశిస్తే గింజ సరిగా తయారవ్వదని చెప్పారు. పురుగు నివారణ కోసం లీటర్ నీటిలో డైమిథోయేట్ 2మిలీ, క్లోరోఫైరీఫాస్ 2.5మిలీ, ఫ్రిప్రోనిల్ 2మిలీ ఈ మందులలో ఏదోఒక మందు స్ప్రే చేసి పేనుబంక పరుగును అరికట్టవచ్చునని సూచించారు.

బస్సులు నడపాలని కోరుతూ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ మీదుగా బస్సులు నడపాలని సీపీఎం నాయకులు తేలు ఇస్తారి ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామ, హుస్నాబాద్ డిపోలకు చెందిన బస్సులను అయినాపూర్ నుంచి నడపడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. పలుమార్లు ఆయా డిపోల మేనేజర్లకు విన్నవించినా ప్రయోజనం లేదని వాపోయారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాలకు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మండల నాయకులు వుల్లంపల్లి సాయిలు, కానుగుల రాజు, సున్నం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..

మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడొద్దని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోవర్ధనగిరి, మసిరెడ్డి తండాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. అలాగే ఇటీవల శస్త్రచికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న పెండ్యాల ఐలయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయిన ప్రతి కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, లక్ష్మి, మంగ, సాంబరాజు, భీలునాయక్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, మోహన్ నాయక్, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 14న రాష్ట్రబంద్

కోహెడ(హుస్నాబాద్): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టులో కేసు వేయడాన్ని నిరసిస్తూ అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వలుస సుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు వల్లే బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. 14న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌ను బీసీలంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాజు, శ్రీనివాస్, చంద్రయ్య, వీరస్వామి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ గ్రంథాలయంలో ఎన్నో సౌకర్యాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా గ్రంథాలయాన్ని ఉద్యోగ ఆశావాహులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులు, పాఠకులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చంద్రబోస్, రాజ్ కుమార్, విజ్జగిరి, అనిల్ కుమార్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇసుక తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

సిద్దిపేటకమాన్: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. చిన్నకోడూరుకు చెందిన రమేశ్ ఇసుక రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

◆ తోటపల్లిలో ఇసుక డంపులు సీజ్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లిలో పలు చోట్ల అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సౌజన్య తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడతూ సంబంధిత వ్యక్తులను విచారిస్తున్నామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినా, నిల్వచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ కొనుగోలు కేంద్రాల కోసం వినతి

హుస్నాబాద్: వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి, మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ గంగారాంకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలు పాటించని ట్రేడర్స్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. చంద్రయ్య, మల్లికార్జున్ రెడ్డి, పరశురాములు, యాదవ్, శ్యామ్ పాల్గొన్నారు.

◆ మానసిక దృఢత్వం అవసరం

సిద్దిపేటకమాన్: ప్రతి ఒక్కరూ మానసికంగా దృఢంగా ఉండాలని, ప్రతి చిన్న విషయానికి అతిగా ఆలోచించి ఆందోళన చెందకూడదని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత, సైకియాట్రీ విభాగ హెచ్ఓడీ డాక్టర్ శాంతి సూచించారు. వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఎస్‌ఆర్‌ఎంఓ జ్యోతి, విమల, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్‌ఎస్‌ది తప్పుడు ప్రచారం

ములుగు(గజ్వేల్): ఓటుహక్కు కూడా లేనివారిని పార్టీలో చేర్చుకొని, బీఆర్‌ఎస్ నేతలు వారిని కాంగ్రెస్ కార్యకర్తలుగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని మాజీ జెడ్పీకోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, గజ్వేల్ యువత విభాగం మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండు నర్సింహులు ఎద్దేవా చేశారు. ములుగులో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన యువకులకు తమ పార్టీతో ఎలాంటి సంబంధం లేదన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు శ్రీనివాస్, వాజీద్, నాయకులు కుమార్, కృష్ణారెడ్డి, రంగసత్యనారాయణగౌడ్, నరేందర్‌రెడ్డి, రాజు, ముత్యంరెడ్డి, వెంకటేశ్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళా అధ్యక్షురాలిగా నియామకం

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన బండమీది మంజుల కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలిగా నియామకమయ్యారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు ముగ్దం లక్ష్మి శుక్రవారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు యేసు, నాయకులు శ్రావణ్, యాదగిరి, నవీన్, రజని తదితరులు పాల్గొన్నారు.

◆ బాలమ్మ సేవలు చిరస్మరణీయం

ములుగు(గజ్వేల్): దివంగత ములుగు సర్పంచ్ చింతకింది బాలమ్మ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి కొనియాడారు. బాలమ్మ 16వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ములుగులో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ విజయమోహన్, మాజీ చైర్మన్ జహంగీర్, వైస్ చైర్మన్ ప్రభాకర్‌గుప్తా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ స్కూల్‌ను సందర్శించిన కమిషనర్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని బండపల్లి ప్రభుత్వ పాఠశాలను మున్సిపల్ కమిషనర్ నాగేందర్ శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలోకి మురుగు నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కాలనీ వాసులిచ్చిన వినతిపత్రాలు పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు ఆయన పాఠశాలను సందర్శించారు. ప్రజల నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు.

◆ సమగ్ర విచారణ జరిపించండి

సిద్దిపేటజోన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిపై సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక బీజేఆర్ భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 13న కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే 17న నిరసన ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు రాజు, ఉమ్మడి మెదక్ జిల్లా దివ్యాంగుల పోరాట సమితి ఇన్‌చార్జి శంకర్ పాల్గొన్నారు.

◆ కోమటిబండలో 'కనువిప్పు'

గజ్వేల్‌రూరల్: మండలంలోని కోమటిబండ గ్రామంలో గురువారం రాత్రి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. పోలీసు కళాకారులు తమ ఆటపాటలతో వివిధ చట్టాలు, అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ మూఢనమ్మకాల ముసుగులో మోసపోవద్దన్నారు.

◆ అధికారుల నిర్లక్ష్యం తగదు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారంలో విద్యుత్ సరఫరాలో సెస్ విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని బీజేపీ నాయకులు సాన వేణు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండారంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్లుగా లూప్‌లైన్‌లు సవరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పలుమార్లు వ్యవసాయబావులు, ఇళ్లలో విద్యుత్ సరఫరాలో సమస్య ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు లూప్‌లైన్ సవరించి అవసరమైన చోట స్తంభాలు వేయించాలని డిమాండ్ చేశారు.